క్లుప్తంగా

పన్ను చెల్లింపునకు ప్రత్యేక కౌంటర్లు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి బకాయి ఉన్న ఆస్తి పన్ను వడ్డీని మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కార్పొరేషన్‌కమిషనర్ దినేష్ కుమార్ ఆదివారం తెలిపారు. పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వీఎల్ పురం, ప్రకాష్‌నగర్ మీసేవ, సీతంపేట మీసేవ, కోటిపల్లి బస్టాండ్ మీసేవ, నారాయణపురం, బొగ్గులదిబ్బ కౌంటర్లలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఇంటి, ఖాళీ స్థలం పన్నులు, నీటి చార్జీలు చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫిలాంత్రోఫిక్ సొసైటీకి వుమెన్ వెల్ఫేర్ అవార్డు



కిరణ్‌బేడీ నుంచి అవార్డును అందుకున్న రాజయోనా

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ స్థాయిలో మహిళా సాధికారతకు కృషి చేసే సంస్థలకు ఇచ్చే వుమెన్ వెల్ఫేర్ అవార్డును ఫిలాంత్రోఫిక్ సొసైటీకి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ డా.కిరణ్ బేడీ అందించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన షీ ప్రైడ్–2024 ప్రత్యేక కార్యక్రమంలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ వ్యవస్థాపకుడు అద్దంకి రాజయోనాకు ఆమె ఈ అవార్డు అందించారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ 2016లో రాజమహేంద్రవరం కేంద్రంగా ప్రారంభించామని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కార్యక్రమాలు చేశామని రాజాయోనా వివరించారు. ఏటా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన మహిళలను గుర్తించి, వారికి జాతీయ స్థాయిలో ప్రతిభా పురస్కారాలతో సత్కరించి, వారి సేవలు భావితరాలకు తెలిసేలా అనేక కార్యక్రమాలను చేశామన్నారు. తమ సంస్థ సేవలకు గతేడాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా అకాడమీ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీల ప్రతిభా పురస్కారాలను అందుకున్నట్టు తెలిపారు.

ప్రశాంతంగా టెట్

ప్రకాశంనగర్: నగరంలో టెట్ ప్రశాంతంగా జరుగుతున్నట్టు జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక లూథర్‌గిరిలోని ఇయాన్ డిజిటల్ జోన్ సెంటర్‌లో ఉదయం సెషన్‌లో 960కు 879 మంది హాజరయ్యారని చెప్పారు. మధ్యాహ్నం సెషన్‌లో 960కు 891 మంది హాజరైనట్టు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర విద్యుత్ మరమ్మతుల కోసం సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ ఆదివారం తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 నుంచి 5 వరకూ అంతరాయం ఉంటుందన్నారు. బొమ్మూరు, రాజవోలు, ఏఎంజీ రమాదేవి గార్డెన్, గాయత్రీనగర్, శ్రీయ గార్డెన్, ప్రశాంతి నగర్, ఎమ్మార్వో ఆఫీస్, ఇందిరమ్మ కాలనీ, వడ్డీ వీరభద్రనగర్, పాత బొమ్మూరు, కొత్తపేట, మురళీకొండ, వెంకటగిరి కొండ, కలెక్టరేట్, హార్లిక్స్ ఫ్యాక్టరీ, ఎస్‌హెచ్ రోడ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, టిడ్కో ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అభివృద్ధే మా మంత్రం



పిడింగొయ్యి గ్రామ సచివాలయం-2 నూతన భవనం శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

- రూరల్ నియోజకవర్గంలో రూ.కోట్లాది అభివృద్ధి
- నేను ప్రజా సేవకుడిని మాత్రమే..
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- పిడింగొయ్యి సచివాలయం, హెల్త్ క్లినిక్ ప్రారంభం
- రూ.3.75 కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన

రాజమహేంద్రవరం రూరల్: వెనుకబడి ఉన్న రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నట్టు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో–ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం పిడింగొయ్యిలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం–3, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్ నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం పిట్లవాని చెరువు నుంచి పిడింగొయ్యి వరకూ రూ.3.75 కోట్లతో నిర్మిస్తున్న రహదారి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా ప్రజల వద్దకే సుపరిపాలన అందించే దిశగా సంస్కరణలు చేపట్టి, గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకు వచ్చారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ స్వరాజ్య పాలనే లక్ష్యంగా సచివాలయ, వలంటరీ వ్యవస్థలను ప్రవేశపెట్టారన్నారు.

ప్రతి అర్హుడూ లబ్ధి పొందాల్సిందే..

అర్హులైన ప్రతి లబ్ధిదారుడు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాన్ని అందుకున్న నాడే నిజమైన ప్రజాస్వామ్యం, రాజ్యాంగబద్ధ పాలన పరిఢవిల్లుతాయని మంత్రి వేణుగోపాలకృష్ణ స్పష్టం చేశారు. గత కొన్నేళ్లుగా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం అభివృద్ధికి దూరంగా ఉందని, అందువల్ల అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాను పాలకుడిని కాదని, ప్రజా సేవకుడిని మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజలకు సేవ చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంతానికి తనను కో–ఆర్డినేటర్‌గా నియమించారని చెప్పారు. ప్రజలకు ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తెస్తే, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి, ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తానని, అందుకు మద్దతు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి దాసరి రాంబాబు, మాజీ ఎంపీపీ రేలంగి వీరవెంకట సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ నల్లమిల్లి శృతి, హుకుంపేట సొసైటీ చైర్‌పర్సన్ బొప్పన సుబ్బారావు, మాజీ ఎంపీటీసీలు కందిరెల్లి సత్తిబాబు, పిల్లా లక్ష్మణరావు, పార్టీ నాయకులు మేడి త్రిమూర్తులు, పడాల వీరరాఘవరెడ్డి, చీరా రాజు, ఇబ్రహీం, సుందరపల్లి అనిల్, మాదాబత్తుల రాజు, జాజుల శ్రీను, బుడ్డిగ శ్రీను, రేలంగి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు ఎం.రూప్‌చంద్, గుంట్రు వెంకటరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తూర్పుకాపు కల్యాణ మంటపానికి స్థలం మంజూరు



రుడా చైర్మన్ సూర్యప్రకాశరావును సత్కరిస్తున్న ఎంపీ భరత్‌రామ్ తదితరులు

- ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్
- రుడా చైర్మన్ రౌతుకు సత్కారం

సీటీఆర్ఐ: తూర్పు కాపు సంఘీయుల అభివృద్ధికి ఆనంద్‌నగర్‌లో ఏడొందల గజాల స్థలాన్ని మంజూరు చేసినట్టు రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ వెల్లడించారు. ఆదివారం స్థానిక శ్రీనివాస రౌతు తాతాలు కల్యాణ మండపంలో జరిగిన తూర్పు కాపు సంఘీయుల ఆత్మీయ సమ్మేళనంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావును సంఘీయులు ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథి ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ కొద్ది రోజుల్లో కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. నగరాన్ని రూ.400 కోట్ల నిధులతో ఆధునీకరించామన్నారు. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ తూర్పు కాపు సంఘీయులకు ఓబీసీ ధ్రువీకరణ పత్రాల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఈ విషయమై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్షణం స్పందించి, తీర్మానాన్ని కేంద్రానికి పంపించారని, ప్రస్తుతం ఈ బిల్లు పార్లమెంటులో ప్రవేశానికి సిద్ధంగా ఉందని గుర్తు చేశారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తూర్పు కాపు సంఘీయులు ఉత్తరాంధ్ర నుంచి మైగ్రేషన్ సర్టిఫికెట్లు తెచ్చుకుని, కుల ధ్రువీకరణ పత్రాలు పొందారన్నారు. ఆ తర్వాత మైగ్రేషన్ పత్రం అవసరం లేకుండా స్థానిక కుల కాపు సంఘానికి వెసులుబాటు కలిస్తూ జీఓ తెచ్చారని, తద్వారా చాలా మంది లబ్ధి పొందారన్నారు. కేంద్ర సర్వీసుల్లో తూర్పు కాపు సామాజిక వర్గానికి ఓబీసీ ధ్రువీకరణ పత్రాలు మంజూరు కాని పరిస్థితుల వల్ల వారు రిజర్వేషన్ ఫలాలను పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ మాట్లాడుతూ తూర్పు కాపులకు ఓ బ్రాండ్ ఐకాన్ రౌతు సూర్యప్రకాశరావు అని ప్రశంసించారు. ఉమా మార్కండేయ దేవస్థానం డైరెక్టర్ యజ్జరపు శ్రీనివాస్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ బురిడి పద్మావతి, ఇన్నీసుపేట బ్యాంకు డైరెక్టర్ కురుమిల్లి స్వరూప్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ కో–ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నక్కా శ్రీనగేష్, రావిపాటి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అధికారంలోకి రావాలని..

- గౌరీపట్నం గుడికి నక్కా రాజేంద్ర ఆధ్వర్యంలో పాదయాత్ర
- జెండా ఊపి ప్రారంభించిన మంత్రి వేణు



పాదయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు తనయుడు వైఎస్సార్ సీపీ యువనేత నక్కా రాజేంద్ర ఆధ్వర్యంలో 50 మంది రాజవోలు నుంచి గౌరీపట్నం మేరీమాత గుడి వరకు పాదయాత్ర చేపట్టారు. ఆదివారం ఉదయం రాజవోలు గ్రామంలో రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పార్టీ రూరల్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించాలని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో 175కు 175 సీట్లు సాధించాలని రాజవోలు దుర్గమ్మ గుడి నుంచి గౌరీపట్నం మేరీమాత గుడి వరకూ నక్కా రాజేంద్ర పాదయాత్ర చేయడం అభినందనీయమన్నారు. సామాజిక న్యాయం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని భావించి, యువత ముందుకు రావడం హర్షణీయమన్నారు. నక్కా రాజేంద్ర మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని, ఆయనకు ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయన్నారు. అలాగే ఏసు ప్రభువు, మేరీ మాత ఆశీస్సులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఉండాలని కోరుతూ, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ వై నాట్ 175 సాధించాలని కోరుతూ పాదయాత్ర చేపట్టినట్టు వివరించారు. అనంతరం నక్కా రాజేంద్రతో కలిసి మంత్రి వేణుగోపాలకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు కొద్దిదూరం పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం బొమ్మూరు మీదుగా పాదయాత్ర బాలాజీపేట, రైల్వే స్టేషన్, రోడ్ కం రైలు బ్రిడ్జి మీదుగా కొవ్వూరు, ఐ.పంగిడి, గౌరీపట్నం మేరీమాత గుడికి చేరింది. పాదయాత్రలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, చెల్లుబోయిన నరేన్, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి, పార్టీ సాంస్కృతిక విభాగ రీజనల్ కోఆర్డినేటర్ నాగులపల్లి ఆశ తదితరులు సంఘీభావం తెలిపారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు సుందరపల్లి అనిల్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, నాయకులు చాపరాజు, రాంకీ, కోటి రాజశేఖర్, నక్కా క్రాంతి, ఎలుగొండ చెల్లాయమ్మ, కాటం సుస్మిత, బన్ను, షేక్ సమీరా, మద్దా దుర్గారావు, పెనుమాక సునీల్, తోడేటి రాహుల్, ఉల్లింగి నవీన్, నక్కా స్వామి, ఎస్ఆర్‌బీ యూత్, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పేదవర్గాల ఆర్థికాభివృద్ధే జగన్ లక్ష్యం

- శాటిలైట్‌సిటీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి వేణుగోపాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: పేదవర్గాల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో–ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం శాటిలైట్ సిటీ గ్రామ ప్రజల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడి ఉన్న బలహీనవర్గాల అభ్యున్నతికి దివంగత డాక్టర్ వైఎస్సార్ హయాంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్టు వివరించారు. పేదల పిల్లల ఉన్నత చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించారన్నారు. నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా 45 ఏళ్లు దాటిన వారికి చేయూత పథకాన్ని అందించి, ఆర్థికంగా బలోపేతం చేశారన్నారు. ఇల్లు లేని వారికి ఇళ్ల స్థలాలు, డ్వాక్రా ద్వారా ఆసరా రుణమాఫీ, పెన్షన్లు అందించడమే కాకుండా, అమ్మ ఒడి నుంచి విదేశీ విద్య వరకూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గానికి రెండుసార్లు ప్రాతినిధ్యం వహించిన వారు ఈ ప్రాంతాభివృద్ధికి ఎటువంటి కార్యక్రమాలు చేపట్టలేదని విమర్శించారు. తాను ఈ ప్రాంత కో–ఆర్డినేటర్‌గా నియోజకవర్గ ప్రజల అభివృద్ధిని కాంక్షిస్తూ, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉభయ రాష్ట్రాల శెట్టి బలిజ సంఘం అధ్యక్షుడు పిల్లి సుబ్రహ్మణ్యం, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి పిల్లి సిరిబాల, ఎన్‌రెడ్‌క్యాప్ రాష్ట్ర డైరెక్టర్ అంగాడి సత్యప్రియ, మాజీ ఉప సర్పంచ్‌లు బొమ్మ శ్రీను, కడవకొల్లు వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు సఫారి నాయుడు, బత్తిన అప్పారావు, దత్త సాయి, మీగడ గంగాధర్, పుచ్చా గోవిందరెడ్డి, పగడాల లక్ష్మణరావు, రుంకాని రవికుమార్, దుంగా శంకర్, కుడిపూడి పద్మ, కుడిపూడి సత్యనారాయణ, గాదె అనురాధ, అర్జునరావు, పానగంటి లక్ష్మి, వడిసల నారాయణ, పాసిపల్లి వెంకటేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు నుంచి బైబిలు మిషన్ మహాసభలు



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న షారోన్ కుమార్, సుదన్ షారోన్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం మార్గాని ఎస్టేట్ గ్రౌండ్స్‌లో ఈ నెల 5, 6, 7 తేదీల్లో బైబిల్ మిషన్ 57వ మహాసభలు జరుగుతాయని కన్వీనర్ ఎన్‌జే షారోన్ కుమార్, కో–కన్వీనర్ సుదన్ షారోన్ తెలిపారు. ఉదయం పది, సాయంత్రం ఆరు గంటలకు సభలు జరుగుతాయని ఆదివారం విలేకరులకు చెప్పారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. దివంగత ఎన్ సుదర్శనరావుఅయ్య 1938లో ఏర్పాటు చేసిన ఈ సభలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని తెలిపారు. బైబిలు మిషన్ ప్రెసిడెంట్ డా.పి.సంజీవరావు, వైస్ ప్రెసిడెంట్ డా.ఏ.దైవారావు, సెక్రటరీ డా.వై ఇమ్మానియేల్, జాయింట్ సెక్రటరీ జీఆర్ ఇమ్మానియేల్ దైవ సందేశం ఇస్తారని తెలిపారు.

పదో తరగతి కీలకమైనది

డీఎస్ఈఓ వాసుదేవరావు

ప్రకాశం నగర్: విద్యార్థి దశలో పదో తరగతి అత్యంత కీలకమైందని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. ఆదివారం స్థానిక లాలాచెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. ప్రతిరోజూ ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ 15 రోజులు ఆరోగ్యంపూ అత్యంత శ్రద్ధ చూపాలన్నారు. ప్రశాంతంగా, ఒత్తిడి లేని జీవనాన్ని గడిపితే నూటికి నూరు శాతం మార్కులపై దృష్టి కేంద్రీకరించవచ్చన్నారు. సెల్ఫీ విత్ టాపర్ ఫొటో తీసుకున్నారు. జిల్లా సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ గౌరీ శంకర్ మాట్లాడుతూ ఈ 15 రోజులు వచ్చిన పాఠ్యాంశాలే కాకుండా, సందేహాలున్న పాఠ్యాంశాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలన్నారు. హెచ్ఎం ఏ.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి.. పింఛను అందజేత



తణుకు ఆస్పత్రిలో సత్యనారాయణకు పింఛను అందజేస్తున్న వలంటీర్

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీకి చెందిన వృద్ధుడు అడ్డాల సత్యనారాయణ తణుకు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో శాటిలైట్‌సిటీ గ్రామ సచివాలయం–1 వలంటీర్ క్రొవ్విడి సత్యవేణి ఆదివారం తణుకు వెళ్లి అయనకు వృద్ధాప్య పింఛను అందించారు. లబ్ధిదారుడు సత్యనారాయణ ఆనందం వ్యక్తం చేశారు.

పోలియో రహిత సమాజానికి సమష్టి కృషి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణుగోపాలకృష్ణ
- ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న సూర్యప్రకాశరావు, చిత్రంలో చందన నాగేశ్వర్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: బాల్య దశలో ఉన్న చిన్నారులకు రెండు పోలియో వ్యాక్సిన్ చుక్కలు వేసి పోలియో రహిత సమాజానికి సమష్టిగా కృషి చేద్దామని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన బొమ్మూరులోని సోమనవారితోటలో ఉన్న గ్రామ సచివాలయం–2లో, కోటిపల్లి బస్టాండ్‌లో, ఇన్నీసుపేట యూపీహెచ్‌సీలో పల్స్‌పోలియో కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో పోలియో మహమ్మారి తీవ్రంగా పట్టి పీడించేదన్నారు. వైద్య రంగంలో వ్యాక్సిన్ ఆవిష్కరణ ద్వారా పోలియో రహితంగా సమాజాన్ని తీర్చిదిద్దే దిశగా అడుగులు వేయడం శుభపరిణామమన్నారు. ఒక్క పోలియో వైరస్ మాత్రమే కాకుండా మలేరియా, మశూచి వంటి వ్యాధులకు కూడా వైద్య రంగం వ్యాక్సిన్ కనుగొని, పూర్తిగా నిర్మూలించగలిగిందని పేర్కొన్నారు. పిల్లలను ఆరోగ్యవంత పౌరులుగా పెంచి సమాజానికి అందించాల్సిన బాధ్యత వారి తల్లిదండ్రులపై ఉందని పేర్కొన్నారు. పేదరికమనేది పెద్ద రోగమని, పేదలకు జబ్బు చేస్తే డబ్బుల్లేక, ఆర్థికంగా వారి కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతాయని పేర్కొన్నారు. ఇది గమనించిన నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి, పేదలకు అండగా నిలిచి, ఆరోగ్య భరోసాను కల్పించారన్నారు. ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఆరోగ్యశ్రీని పదింతలు పెంచి, 3,250 రకాల జబ్బులను పొందుపరిచి, రూ.25 లక్షల వరకూ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని పెంచి, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమాధికారిణి కేఎస్ జ్యోతి, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.కె.సుధాకర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, డివిజన్ల జేసీఎస్ కన్వీనర్ కొప్పిసెట్టి ప్రసాద్‌బాబు(రాజమౌళి), సచివాలయాల కన్వీనర్లు యెనుముల త్యాగరాజు, సోమన శ్రీనివాస్, దాకే శ్రీనివాస్, తోడేటి రాజా, కాకులపాటి కుమార్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ కృషి చేయాలి

సీటీఆర్ఐ: సమాజాన్ని పోలియో రహితంగా నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా స్థానిక కంబాలపేట వద్ద ఉన్న పీహెచ్‌సీలో రాష్ట్ర పచ్చదన, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ పూర్వ రోజుల్లో పోలియో మహమ్మారి పట్టిపీడించేదని, వ్యాక్సిన్ ఆవిష్కరణ శుభపరిణామమన్నారు.

97.58 శాతం మందికి పోలియో చుక్కలు

కడియం: మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లోని 13 గ్రామాల్లో 97.58 శాతం పిల్లలకు పోలియో చుక్కలు అందజేసినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. ఆదివారం ఉదయం ప్రారంభమైన పోలియో చుక్కల కార్యక్రమానికి మొత్తం 36 బూత్‌లను ఏర్పాటు చేశారు. ట్రాన్సిట్, మొబైల్ బృందాలు కూడా ఒకొక్కటి సేవలందించాయి. మండల వైద్యులు ఎన్.జెస్సీ సుప్రియ, ఎం.మణిజ్యోత్స్న, స్వరూప, ఎస్.నాగసాయిమౌర్య ఆధ్వర్యంలో ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కల మందు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 5,582 మందిలో 5,447 చిన్నారులకు తొలిరోజు పోలియో చుక్కలు వేశారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సోమ, మంగళవారాల్లో కూడా పోలియో చుక్కలు అందిస్తామని వైద్యులు తెలిపారు. దుళ్లలో సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కడియపులంకలో ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, కడియంలో ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని, ఎంపీటీసీ బట్టు స్వప్న, మాధవరాయుడుపాలెంలో సర్పంచ్ అన్నందేవుల చంటి, వేమగిరిలో స్థానిక నాయకులు పితాని శ్రీను, నరాల శ్రీను కార్యక్రమాన్ని ప్రారంభించారు.



దుళ్లలో పల్స్‌పోలియో ప్రారంభిస్తున్న సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు

రూరల్‌లో 94.6 శాతం..

ధవళేశ్వరం: పల్స్ పోలియో కార్యక్రమం రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 94.6 శాతం నమోదైంది. ధవళేశ్వరం పీహెచ్‌సీ వద్ద వైద్యాధికారి డాక్టర్ కె.సుధాకర్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ధవళేశ్వరం పాత గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా వైఎస్సార్ సీపీ నాయకుడు సాధనాల చంద్రశేఖర్(శివ) చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో మొత్తం 16,825లో 15,916 మందికి పోలియో చుక్కలు వేశారు. మొత్తం 51 బూత్‌ల్లో కార్యక్రమం జరిగింది. 16 మొబైల్ రూట్ల ద్వారా పోలియో చుక్కలు వేశారు. మిగిలిన వారికి రెండు రోజుల పాటు ఇంటింటా పోలియో చుక్కలు వేస్తామని డాక్టర్ సుధాకర్ తెలిపారు.